

శైవ క్షేత్రాల ముస్తాబు 8లో

హిందువులంతా పవిత్రంగా జరుపుకునే పర్వదినమే మహా శివరాత్రి.. ఆ రోజున శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.



నూతన డీఆర్ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్ఎంగా లలిత్ బోరా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

స్వర్ణ తులసీదళార్చన



సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిగింది. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు అందించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మద్యం దుకాణాల మూసివేత

• ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసే వరకు ఆంక్షలు

తుమ్మపాల: ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో అన్ని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలను మూసివేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు జరిగే మార్చి 3న కూడా మద్యం దుకాణాలను మూసివేయనున్నట్లు తెలిపారు.

9న బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ మేళా



బౌద్ధమేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సత్యవతి

అనకాపల్లి: జిల్లాలో మొట్టమొదటిసారిగా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 9న బౌద్ధమేళా జరుగుతుందని మాజీ ఎంపీ బి.వి.సత్యవతి చెప్పారు. తమ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె బౌద్ధమేళా కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు ధమ్మజ్యోతి ర్యాలీ, తరువాత కొండపై బుద్ధుని గుహలో బౌద్ధ స్తూపం వద్ద ధమ్మ దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కమిటీ సభ్యుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల సాంస్కృతిక కార్యక్రమాలు, కొండ దిగువన లేజర్ స్కీన్ థియేటర్, బయట ప్రాంగణంలో బౌద్ధ సమ్మేళనం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు బండి అప్పారావు, శరగడం శ్రీనివాసరావు, వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, పిరట్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు చికెన్, ఎగ్ మేళా

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు చికెన్, ఎగ్ మేళా నిర్వహిస్తున్నట్లు నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు మండపాటి జానకీరామరాజు తెలిపారు. ప్రజలందరికీ చికెన్, ఎగ్ వినియోగం వలన లాభాలు వివరించి, బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కోడి మాంసం, గుడ్లతో చేసిన రుచికరమైన ఐటమ్స్ ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

విధ్వంసకాండ



రెవెన్యూ అధికారులు ధ్వంసం చేసిన ఇంటి గోడలు



తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- కొనసాగుతున్న రాజకీయ కూల్చివేతలు
- వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శ్రీనివాస్ సోదరుడి భవనం ధ్వంసం
- వందలాదిమంది పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో విధ్వంసం
- స్వచ్ఛందంగా తొలగించుకుంటామన్నా అంగీకరించని అధికారులు
- ఇంతలో కూల్చివేత నిలిపివేయాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు
- ధ్వంసమైన గ్రౌండ్ ఫ్లోర్ గోడలు, రెండో ఫ్లోర్ శ్లాబ్
- చిల్లర రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ మండిపాటు

సోమవారం ఉదయం 7 గంటలు.. బిలబిలమంటూ 200మంది పోలీసులు దిగారు.. సుమారు 100మంది రెవెన్యూ సిబ్బంది వచ్చారు.. వచ్చీ రావడంతోనే వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ భవనం కూల్చివేతకు పాల్పడ్డారు. నోటీసులో రెండు రోజులు గడువిచ్చారు కదా.. భవనాన్ని యజమానే తొలగించుకునేందుకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ అభ్యర్థించినా తహసీల్దార్ ససేమిరా అన్నారు. దగ్గరుండి మరీ కూల్చివేత పనులను జరిపించారు. ఇంతలో 10.47 గంటలకు భవనం తొలగింపును నిలిపివేయాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో ఎట్టకేలకు విధ్వంసకాండను అధికారులు విరమించుకున్నారు. కానీ అప్పటికే రెండో ఫ్లోర్ శ్లాబ్ సగం తొలగించారు. కింద పోర్షన్ గోడలను ధ్వంసం చేశారు.

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీ నేతల భవనాల కూల్చివేతల పరంపర కొనసాగుతోంది. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడికి వ్యతిరేకంగా పనిచేసిన నాయకులను టార్గెట్ చేశారు. అక్రమ నిర్మాణాల పేరుతో నాయకుల భవనాలను కూల్చివేసి ఆర్థికంగా దెబ్బ తీసేందుకు యత్నిస్తున్నారు. మొన్న నవంబర్‌లో గచ్చపువీధిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు చిటికెల కరుణాకర్ భవనాన్ని మున్సిపల్ అధికారులు పడగొట్టారు. నేడు శారదనగర్‌లోని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ భవనం కూల్చివేతకు పాల్పడ్డారు. ఉదయం 7 గంటలకే తహసీల్దార్ రామారావు భారీసంఖ్యలో పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని వెంటపెట్టుకొని బిల్డింగ్ దగ్గరకు చేరుకున్నారు. అప్పటికే మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులతో భవనం వద్దకు వచ్చారు. యజమానే భవనం తొలగించుకుంటాడని, సమయం ఇవ్వమని తహసీల్దార్‌ను కోరినప్పటికీ వినలేదు. భవనంలో ఫర్నిచర్‌ను రెవెన్యూ సిబ్బంది బయటకు తీస్తుండగా భవన యజమాని, పార్టీ నాయకులు అడ్డుకున్నారు. అంతలోనే కూల్చివేత పనులు నిలిపివేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో అధికారులు అక్కడ నుంచి జారుకున్నారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.



మోహరించిన పోలీసులు



రెండో ఫ్లోర్ శ్లాబ్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కోర్టుల ద్వారా ఎదుర్కొంటాం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే గణేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్పీకర్ అకృత్యాలను న్యాయస్థానాల ద్వారా ఎదుర్కొంటామన్నారు. వందలాది మంది అధికారులు మూకుమ్మడిగా వచ్చి కూల్చివేతకు పాల్పడ్డారని, సమయం ఇవ్వమని కోరినా వినని అధికారులు హైకోర్టు ఉత్తర్వులతో జారుకున్నారన్నారు. అయ్యన్నపాత్రుడి కుట్రలకు వ్యతిరేకంగా కోర్టుల్లో పోరాడదామని, న్యాయ దేవతే మనల్ని కాడాపడుతుందని క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. ప్రజలు అధికారం ఇచ్చింది ఐదేళ్లకేనని, 50 ఏళ్లకు కాదన్న విషయాన్ని అయ్యన్నపాత్రుడు గుర్తు పెట్టుకోవాలన్నారు. 'మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. మేము టీడీపీ నాయకులపై ఇదే విధంగా వ్యవహరించాల్సి వస్తుంది' అని హెచ్చరించారు. మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలన్నీ టీడీపీ హయాంలోనే జరిగాయని, కొత్తగా చేసిన నిర్మాణాలు కాదన్నారు. రాజకీయ ప్రత్యర్థుల ఇళ్లు కూల్చివేసే విధానం వల్ల సామాన్య ప్రజలకు నష్టం జరుగుతుందని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. స్పీకర్ రాజకీయ కక్షతో తన భవనాన్ని కూల్చివేస్తున్నారని శ్రీనివాసరావు ఆరోపించారు. అయ్యన్నపాత్రుడి ఒత్తిళ్లకు లొంగిన అధికారులు గడువు ఇవ్వకుండా భవనాన్ని కూల్చివేయడం అన్యాయమని ఆవేదన చెందారు. రాజకీయంగా తనను ఎదుర్కొలేక తన ఆస్తులపై పడ్డారన్నారు. అమరావతిలో ఉన్న స్పీకర్ ఫోన్ ద్వారా ఆదేశాలు ఇస్తూ, తనపై కక్ష సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ ప్రసాద్, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, లీగల్ సెల్ అధ్యక్షుడు మాకిరెడ్డి బుల్లిదొర, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి నాగ గజలక్ష్మి, యూత్ అధ్యక్షుడు తమరాన శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడి శ్రీను అండగా నిలిచారు.

అదనపు కట్నం ఇవ్వలేదని కుల బహిష్కరణ!

- కలెక్టరేట్ వద్ద బాధితుల నిరసన
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన
- కోడ్ ఉందని కలెక్టర్ వద్దకు అనుమతించని పోలీసులు

తుమ్మపాల : అదనపు కట్నం ఇవ్వలేదని, విడాకులకు అంగీకరించలేదని అక్కసుతో కులపెద్దల సమక్షంలో పెట్టి జిల్లా నుంచి కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పట్టణంలో దొమ్మరి సామాజిక వర్గానికి చెందిన అనపరెడ్డి భువనేశ్వరి తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన తన భర్త అనపరెడ్డి సాయి అత్త సావిత్రి, బావ పాపారావు అదనపు కట్నం కోసం తనను తీవ్రంగా వేధించారని, ప్రసవం అయ్యాక పుట్టింటి నుంచి డబ్బు తీసుకునే రావాలని చెప్పడంతో గత ఏడాది ఆగస్టులో అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపింది. దీంతో పోలీసు కేసు పెట్టి తప్పు చేశావంటూ కొందరు పెద్ద మనుషులు తమను కుల బహిష్కరణకు ఆదేశించారని చెప్పింది. రాజానగరానికి చెందిన నెల్లూరు నాగేశ్వరరావు,అనకాపల్లి జిల్లాకు చెందిన రెడ్డి అప్పరాజు, పసుపులేటి శ్రీను, అమరశెట్టి అప్పారావు, అనపరెడ్డి శ్రీను, రెడ్డి అన్నవరం, పసుపులేటి సూరిబాబు కుల పంచాయతీపెట్టి తమకు రెండు లక్షలు జరిమానా విధించి తన తల్లిదండ్రుల నుంచి లక్ష వసూలు చేశారని తెలిపారు. అయినా ఫలితం లేదని, తమతో మాట్లాడకూడదని, ఎవరైనా తమను శుభకార్యాలకు పిలిస్తే వారికి రూ.10 వేలు జరిమానా చెల్లించాలని ఆదేశించారని తెలిపింది.కులబహిష్కరణపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తమకు ఆత్మహత్యే గతి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయకుండా పోలీసులు ఎన్నికల కోడ్ అంటూ కలెక్టరేట్ లోపలికి అనుమతించకపోవడం పట్ల తీవ్ర ఆవేదన చెందారు.



నిరసన తెలుపుతున్న బాధితులు

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు



రెండో విడత శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించుకోవాలి
- నిబంధనలు తూచా తప్పక పాటించాలి
- 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- ఎన్నికల సిబ్బందికి మలి విడత శిక్షణలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సెక్టారు అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీవో)తో సోమవారం కలెక్టరేట్‌లో రెండో విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు పూర్తి అవగాహన కల్పించుకుని ఎన్నికల విధులకు సమాయత్తం కావాలన్నారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పంపిణీ కేంద్రం వద్ద అందించే పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని చెక్ లిస్ట్‌లో పొందుపరిచిన మేరకు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఎటువంటి తప్పిదానికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2,885 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ రోజున సాయంత్రం నాలుగు గంటల తరువాత వరుసలో ఉన్న ఓటర్లకు టోకెను ఇచ్చి ఓటింగు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు, సామగ్రిని జాగ్రత్తగా సీలు వేసి పట్టణంలోని జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో అందజేయాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారులు డీపీఆర్సీ, జిల్లా కో–ఆర్డినేటరు నాగలక్ష్మి, సివిల్ సప్లై జిల్లా మేనేజరు పి.జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు, డిప్యూటీ తహసీల్దారు పి.అరుణచంద్ర, ఎన్నికల నిబంధనలు, పోలింగ్ విధానం, బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విధులకు హాజరయ్యే 12 మంది సెక్టారు అధికారులు, 58 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 76 మంది ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణ కీలకం

అనకాపల్లి: ఈనెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, సాధారణ పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ చాలా కీలకమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. తమ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడటమే కాకుండా, ఉల్లంఘన జరిగితే, ఆ సమాచారాన్ని సీల్డ్ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకులకు అందించాలన్నారు.

తప్పని మూగ రోదన!

- పశు సంచార వైద్యానికి కూటమి ప్రభుత్వం మంగళం
- సంచార వైద్య వాహనాలు ఆపేయాలని నిర్ణయం
- వాట్సప్ మెసేజ్‌తో కంగుతున్న సిబ్బంది
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో పశు వైద్యానికి పెద్దపీట
- జిల్లాలో 13 వాహనాల ద్వారా సేవలు

సాక్షి, అనకాపల్లి: అత్యవసర వైద్య సేవలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. ఇప్పటికే 104, 108, ఆరోగ్యశ్రీ, వంటి వ్యవస్థలను గాలికి వదిలేసిన సర్కారు.. తాజాగా మూగ జీవాలకు అత్యవసర వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార వైద్యానికి మంగళం పాడేందుకు సిద్ధమవుతోంది. ఉన్న పళంగా 1962 ఆరోగ్య సేవలు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలో 13 సంచార వాహనాలకు బ్రేకులు పడ్డాయి. ఈ నెల 15వ తేది అర్ధరాత్రి నుంచి విధులకు హాజరు కానక్కరలేదని ఉద్యోగులకు వాట్సప్ మెసేజ్ ద్వారా సమాచారం కూడా అందించారు. దీంతో వీటిలో పనిచేసే పైలెట్(డ్రైవర్), పారావిట్, డాక్టర్, పైలట్ రిలీవర్లు 44 మంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఉన్న పళంగా రోడ్డున పడేశారు..

రాష్ట్ర వ్యాప్తంగా పశు అంబులెన్స్ సేవలను జీవీకేఈ ఎంఆర్ఐ సంస్థ నిర్వహిస్తోంది. జిల్లాలో మొత్తం 13 పశు సంచార వాహనాలు ఉన్నాయి. అనకాపల్లి నియోజకవర్గంలో 2, యలమంచిలి నియోజకవర్గంలో 2, నర్సీపట్నం-2, మాడుగుల-2, చోడవరం-2, పాయకరావుపేట-2, పరవాడ మండలంలో ఒకటి చొప్పున వాహనాలు తిరుగుతున్నాయి. ఈ నెల 16వ తేదీ నాటికి సంస్థ కాంట్రాక్ట్ గడువు ముగిసిందని, అందులో పని చేసే ఉద్యోగులు తప్పుకోవాలంటూ ప్రభుత్వం నోటీసులు పంపింది. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా చెప్పడంతో ఉద్యోగులు అవాక్కయ్యారు. మూడేళ్లుగా పని చేస్తున్న తమను ఉన్నఫళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెరుగుతాయని భావించిన తమకు చేదు అనుభవం ఎదురైందని వాపోతున్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పశుసంచార వాహన సిబ్బంది

లక్షలాది పశువులకు సేవలు

ఈ మూడేళ్లలో జిల్లా వ్యాప్తంగా 12,42,324 పశువులకు ప్రాథమిక చికిత్సలు అందించారు. పశువులకు వివిధ వ్యాధుల నివారణకు 12,72,290 టీకాలు వేశారు. 12,01,279 పశువులకు నట్టల నివారణ మందులు, 80,523 పశువులకు అత్యవసర వైద్య సేవలందించారు. వీటితోపాటు లక్షలాది మేకలు, గొర్రెలకు కూడా వైద్య సేవలందించారు. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పశువు అనారోగ్య సమస్య వివరిస్తే చాలు రైతు ముంగిటకు సంచారం వాహనంతో వచ్చి వైద్య సేవలు అందించారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం పశువును సమీపంలోని ఏరియా పశువైద్యశాల, వెటర్నరీ పాలీ క్లినిక్‌కు తరలించేవారు.



అత్యవసర వైద్యం అందిస్తున్న పశుసంచార సిబ్బంది



జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పశుసంవర్ధక జేడీ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

మూడేళ్లుగా నిర్విరామంగా సేవలు

పాడి రైతులకు అండగా ఉండేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 మేలో పశుసంచార అంబులెన్స్ సేవలకు శ్రీకారం చుట్టింది. ఇందు కోసం ప్రత్యేకంగా 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఫోన్ చేసి పశువు అనారోగ్య సమస్య వివరిస్తే చాలు అంబులెన్స్‌తో రైతు ముంగిటకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఇలా ప్రతి నియోజకవర్గానికి రెండు వాహనాలు.. అందులో ఇద్దరు డ్రైవర్లు(పైలెట్లు), ఒక డాక్టర్, ఒక వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించారు. డాక్టర్‌కు నెలకు రూ.35,000, పారావిట్‌కు రూ.18,400, డ్రైవర్‌కు రూ.10,500 వేతనం చెల్లిస్తున్నారు. గత మూడేళ్లుగా నిర్విరామంగా సేవలు అందిస్తున్నారు. ఈ నెల 15న టెర్మినేట్ చేస్తున్నట్టు వాట్సప్ మెసేజ్ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ భద్రత లేకుండా పోయింది..



మూడేళ్లుగా సంచార అంబులెన్స్‌లో పని చేస్తున్నాం. సీనియార్టీ ఉంది కదా వేతనాలు పెరుగుతాయని భావించాం. కానీ ఒక్కసారిగా ఉద్యోగాల నుంచే తీసేస్తున్నారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. రోడ్డున పడ్డాం. ఏ పనిచేసుకుని మా కుటుంబాలను పోషించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఏ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చినా మా ఉద్యోగాలకు భద్రత కల్పించాలి. వేతనాలు కూడా పెంచాలి. ఈ నెల 21న కలెక్టర్ విజయ కృష్ణన్‌కు, జేడీ రామ్మోహనరావుకు వినతి పత్రాలు అందజేశాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

– గొల్లవిల్లి లక్ష్మణ్‌రావు, డ్రైవర్, పశుసంచార వాహనం

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- నేరస్తులకు సకాలంలో శిక్ష పడాలి
- నేర సమీక్షలో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి రవాణాపై దృష్టి పెట్టాలని, వివిధ పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, సాధారణ మరణాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, నేరం చేసిన వ్యక్తులకు సకాలంలో శిక్షపడేలా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో చోరీలు ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున పాత కేసుల్లో ముద్దాయిలపై దృష్టి పెట్టాలన్నారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, వి.విష్ణుస్వరూప్, పి.శ్రీనివాసరావు, ట్రెయినీ డీఎస్పీ ఎం.వి.కృష్ణ చైతన్య, సీఐలు కె.లక్ష్మణమూర్తి, ఎస్.బాలసూర్యారావు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త చింతపండు ధరలు పుల్లన



మాడుగుల వారపు సంతకు వచ్చిన చింతపండు

మాడుగుల : అల్లూరి జిల్లా దేవాపురం చింతపండుకు మంచి గిరాకీ ఉంటుంది. అయితే సోమవారం జరిగిన మాడుగుల వారపు సంతకు దేవాపురం నుంచి చింతపండు అరకొరగా వచ్చింది. దూర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రావడంతో 40 కిలోలున్న కావిడి రూ.4 వేలు ధర పలికింది. గతంలో ఇదే కావిడి రూ.1500 నుంచి రూ.3 వేలు ఉండేది. ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గడంతో పాటు రవాణా చార్జీలు పెరగడంతో ధరలు పెంచుతున్నామని గిరి రైతులు చెబుతున్నారు. గతంలో ఉదయం 8 గంటలకే చింతపండు విక్రయాలు పూర్తయ్యేవి. ఇపుడు ధరలు పెరగడంతో 12 గంటల వరకు కొనుగోలుదారుల కోసం రైతులు ఎదురు చూడవలసి వచ్చింది.

వుషూలో సత్తాచాటిన చెట్టుపల్లి విద్యార్థినులు



క్రీడాకారులను అభినందిస్తున్న స్పీకర్ సతీమణి పద్మావతి

నర్సీపట్నం: రాజమండ్రిలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన వుషూ స్టేట్ టోర్నమెంట్‌లో చెట్టుపల్లి హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థినులు పతకాలు సాధించారు. 28 నుంచి 75 కేజీల విభాగాల్లో 18 మంది పాల్గొనగా, 12 మంది పతకాలు సాధించారని కోచ్‌లు వేపాడ ప్రియాంక, శేఖర్ తెలిపారు. ప్రియాంక గోల్డ్ మెడల్, జనుకుల కిరణ్మయి, ఇసారపు నీలిమ సిల్వర్, చెల్లుబోయిన తనుశ్రీ, లోచల హరణ్యశ్రీ, ప్రగడ చాందిని, కామిరెడ్డి యశస్విని, సుకల పూజిత, కోసూరి మాధురి, మొల్లి సౌమ్య శ్రీ వర్షిత, జెర్రిపోతుల అంకిత, తుపాకుల సత్య దుర్గ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి అభినందించారు.

శైవ క్షేత్రాల ముస్తాబు



బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగం



ఉత్తర వాహినిలో భక్తులు స్నానం ఆచరించేందుకు సిద్ధం చేసిన ఘాట్లు



పాకలపాడు గురుదేవుల ఆశ్రమం

ఉత్తర వాహినికి శివరాత్రి శోభ

రేపటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

నర్సీపట్నం: హిందువులంతా ఎంతో పవిత్రంగా జరుపుకునే పర్వదినమే మహా శివరాత్రి.. హరిహరులిద్దరికీ ఎంతో ప్రీతికరమైనది.. ఆ రోజున జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. నదీస్నానాలు ఆచరిస్తే పుణ్యం వస్తుందని నమ్మకం. ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు బ్రహ్మలింగేశ్వస్వామి ఆలయం, ఉత్తర వాహినిలోని పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, సత్యనారాయణస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆధ్యాత్మిక కేంద్రమైన ఉత్తర వాహిని శివరాత్రి స్నానాలకు సిద్ధమైంది.

బలిఘట్టం త్రిశూల పర్వతంపై ప్రసిద్ధ బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. లోక కల్యాణార్థం బలిచక్రవర్తి తలపెట్టిన తపస్సుకు మెచ్చిన బ్రహ్మ శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. త్రేతాయుగంలో జరిగిన ఈ సంఘటనతో ఈ ప్రాంతానికి చరిత్రలో స్థానంలో లభించింది. అందుకే ఈ ప్రాంతం బలిఘట్టంగా పేరు గావించింది. ఈశ్వరుడు పశ్చిమ ముఖంగా ఉండి, సమీపంలో ఉన్న నది ఉత్తర ముఖంగా ప్రవహించడంతో కాశీతో సమానమని భక్తులు విశ్వాసం. ఎంతో విశిష్టత కలిగిన బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి శివలింగాన్ని దర్శించుకుంటారు. హిందూ మహారాజు శివునికి నిత్యం పూజలు చేసేవాడని, ఒక ఏడాదిలో శివార్చణకు నీరు లేకపోవడంతో విష్ణుమూర్తి కోసం తపస్సు చేయగా వరహా అవతారంలో దర్శనమించిన స్వామి నీటిని సమకూర్చడంతో ఈ ప్రాంతంలో ప్రవహించే వరాహా నదికి ఆ పేరు వచ్చింది. ఈ నదీ ఉత్తర దిక్కుగా ప్రవహించడంతో ఉత్తర వాహినిగాను, దక్షిణకాశీగా చరిత్రలో నిలిచింది. బ్రహ్మచే ప్రతిష్ఠంపబడిన ఈ శివలింగానికి ఏటా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజాధికార్యక్రమాలు అత్యంత వైభంగా జరుగుతాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పునీతులవుతారు. ఉత్తర వాహినిలో స్నానం ఆచరించడం సర్వపాప పరిహారంగా భక్తులు భావిస్తారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం పూర్తిగా రాతితోనే నిర్మితమైంది. రాత్రి స్తంభాలు, గోపురం సైతం రాతితోనే నిర్మించారు. వేల సంవత్సరాల క్రితమే ఈ దేవాలయం పూర్తిస్థాయిలో నిర్మితమైందని స్థానికులు చెబుతుంటారు. ఉత్తర వాహినిలోని శైవ క్షేత్రమైన బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి గాంచింది. బ్రహ్మలింగేశ్వరుడు భక్తుల కోసం ప్రత్యక్ష దైవంగా సాక్షాత్కరించి వారి బాధలు, కోరికలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. మూడు రోజుల పాటు నిత్య పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది చిడతల కోలాటం, తప్పెటగుళ్లు, భజనలు, వివిధ కళాబృందాలతో సాంస్కృతిక కలల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గురుదేవుల ఆశ్రమం....

బలిఘట్టం ఉత్తర వాహినిలో పాకలపాడు గురుదేవుల ఆశ్రమం ఆధ్యాత్మికంగా కేంద్రంగా విరాజిల్లుతోంది. నిత్యం భక్తుల రాకపోకలతో గురుదేవుల ఆశ్రమం సందడిగా ఉంటోంది. ప్రతి పౌర్ణమి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహా శివరాత్రి పర్వదినాల్లో భక్తుల తాకిడి మరింత అధికమవుతుంది. బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు గురుదేవుల ఆశ్రమాన్ని సందర్శించి గురుదేవుల ఆశీస్సులు పొందుతారు. ఇక్కడకు సమీపంలో రమా సమేత సత్యనారాయణస్వామిని దర్శించుకుంటారు.

కొత్త అమావాస్య జాతర రాట ప్రతిష్ట



జాతర రాట మహోత్సవాన్ని నిర్వహిస్తున్న ఉప కమిషనర్ సుజాత, ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర వచ్చే నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎస్.సుజాత తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో జాతర రాట ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం అమ్మవారి బాలాయంలో ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో దేవాలయం సూపరింటెండెంట్ విజయ్ కుమార్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్ట్

నర్సీపట్నం: మండలంలోని మెట్టపాలెం గ్రామంలో జనవరి 16న జరిగిన చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు జువెనైల్ హోమ్‌కు తరలించామని రూరల్ ఎస్సీ రాజారావు తెలిపారు. మైనర్ నిందితుడు అదే గ్రామానికి చెందిన ఎ.వరలక్ష్మి ఇంట్లో చోరీకి పాల్పడి మూడు సెల్‌ఫోన్లు, రూ.14 వేలు కాజేసినట్లు రుజుకావడంతో కేసు నమోదు చేసి, జువెనైల్ హోమ్‌కు తరలించామన్నారు.

గంజాయి రవాణా కేసులో ఐదుగురికి పదేళ్ల జైలు

అనకాపల్లి: గంజాయి రవాణా కేసుల్లో ఆరిపాక నాగేంద్ర, కొర్ర సింహాద్రి, షేక్ నజీర్‌వల్లి, బాధ ఆనంద్, బచ్చలి వెంకన్నకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఎస్పీ కథనం మేరకు వివరాలు.. 2012లో అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్రవాహనాలపై 40 కేజీల గంజాయిని మూటలుగా కట్టి రవాణా చేస్తున్న వ్యక్తులు వాహనాలు, గంజాయిని విడిచిపెట్టి పారిపోయే ప్రయత్నం చేశారు. అప్పటి ఎస్ఐ బి.సతీష్ తమ సిబ్బందితో వెంటబడి పట్టుకున్నారు. ఈ కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు చాకలిపెట గ్రామానికి చెందిన ఆరిపాక నాగేంద్ర, ముంచంగిపుట్టు మండలం వందనాపల్లి గ్రామానికి చెందిన కొర్ర సింహాద్రి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు పంచాయతీకి చెందిన షేక్ నజీర్‌వల్లి, పాడేరు మండలం కిందంగి పంచాయతీ కదిలే గ్రామానికి చెందిన బాధ ఆనంద్, పాడేరు గుల్లెలు పంచాయతీ, పెదవాంచరంగి గ్రామానికి చెందిన బచ్చలి వెంకన్నలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ చెప్పారు.

అధిక పరిహారం కోసం పోలవరం రైతుల డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న పోలవరం కాలువ అధికారి జి.రాజేంద్రప్రసాద్, రైతులు

అనకాపల్లి: పోలవరం కాలువ నిర్మాణం కోసం అనకాపల్లి పట్టణంలో సౌత్-1 రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత రేటుకు మూడు రేట్లు అధికంగా పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. గవరపాలెం జాతీయ రహదారి సౌత్-1 సమీపంలో బుద్ద గంగునాయుడు షెడ్ వద్ద పోలవరం కాలువ అధికారి జి.రాజేంద్రప్రసాద్ సోమవారం రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మాణానికి సుమారు 15 సంవత్సరాల క్రితం భూములను సేకరించారని, అప్పటి ధరకు ప్రస్తుత మార్కెట్ ధరకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. 50 మంది రైతులు భూములు కోల్పోతున్నట్లు చెప్పారు. కాలువ నిర్మాణ అధికారి జి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆ విషయాన్ని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రైతులు మద్దాల రాజు, పెంటకోట సరోజిని, కాంద్రేగుల ప్రసాద్, విలేజ్ రెవెన్యూ అధికారి కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోన లక్ష్మణ

అనకాపల్లి: భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మికులకు నిధులు అందజేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బోర్డు నుంచి దారి మళ్లిన రూ.1200 కోట్లు వెనక్కి తెప్పించాలన్నారు. 46 వేల మంది కార్మికుల క్లెయిమ్‌లు అందజేయాలని కోరారు. 55 ఏళ్లు దాటిన ప్రతి కార్మికునికి నెలకు రూ.6 వేలు పెన్షన్ అందజేయాలని, పెరిగిన సిమెంట్, ఐరన్, కలప ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్ని సత్తిబాబు, పల్లా నర్సింగరావు, మొల్లి చిలుకు, చిన్ని కొండబాబు, చొప్ప రాము, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు గాయాలు

అనకాపల్లి: పట్టణంలో శారదానద్ది బ్రిడ్జిపై సోమవారం బొలేరో వాహనం, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న పృథ్వీ, అనిల్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పృథ్వీ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి తోటాడ జంక్షన్ సమీపంలో సుమారుగా 55 నుంచి 60 సంవత్సరాలు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులకు సోమవారం స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇక్కడకు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిమ్మలోవలో శివాలయం దగ్గర సర్పాల నాట్యం!

బుచ్చెయ్యపేట: మండలంలో గల పొట్టిదొరపాలెం శివారు నిమ్మలోవ శివాలయం దగ్గర రెండు సర్పాలు నాట్యమాడాయి. మహాశివరాత్రికి ముందు కొండల దగ్గరలో ఉన్న స్వయంభూ నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సర్పాలు ప్రత్యక్షమవుతాయని ప్రతీతి. అందుకు తగ్గట్టుగా సోమవారం ఆలయాన్ని శుభ్రం చేయడానికి వచ్చిన గ్రామస్తులు నాగసర్పాలు నాట్యమాడటాన్ని చూసి భక్తిభావంతో పూజలు చేశారు.

సమర్థవంతంగా పోలీస్ విధులు



అనకాపల్లి జిల్లా అదనపు అదనపు ఎస్పీ దేవప్రసాద్‌కు సెల్యూట్ చేస్తున్న పోలీస్ జాగిలం



ఏఎస్పీ దేవప్రసాద్‌కు గౌరవ వందనం చేస్తున్న ఏఆర్ పోలీస్ సిబ్బంది

ఆరిలోవ(విశాఖ): పోలీస్ విధులు ఎంత కష్టమైనప్పటికీ సమర్థవంతగా నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. విశాఖ జిల్లా విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ క్రీడా మైదానంలో రెండు వారాలుగా నిర్వహించిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ వార్షిక డీమొబలైజేషన్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు సిబ్బంది గౌరవ వందనం చేశారు. పోలీస్ జాగిలం ఆయనకు సెల్యూట్ చేసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డీమొబలైజేషన్‌ను ఎవ్వరూ భారంగా భావించకూడదన్నారు. సిబ్బందిపై గురుతర బాధ్యత ఉందని, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబంపై పూర్తి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. రెండు వారాల ప్రత్యేక కార్యక్రమంలో పరేడ్, వీఐపీ సెక్యూరిటీ నిర్వహణ, రక్షణ, ఆయుధాల వినియోగం, ఫైరింగ్ ప్రాక్టీస్, బందోబస్తు నిర్వహణ, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థితుల్లో మాబ్ కంట్రోల్ తదితర నైపుణ్యాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పునఃసమీక్షించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు మన్మధరావు, రామకృష్ణారావు, అరవింద్ కిశోర్, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దీపం గ్యాస్‌కు అదనంగా వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: దీపం పథకం గ్యాస్ సిలిండర్ల పంపిణీ సమయంలో నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింటు కలెక్టర్ ఎం.జాహ్నవి గ్యాస్ ఏజెన్సీలను హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సివిల్ సప్లయ్ అధికారులు, గ్యాస్ కంపెనీల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందజేస్తున్న పథకాలపై ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తుందన్నారు. అందులో భాగంగా దీపం పథకంపై ఐవీఆర్ఎస్ పద్ధతి ద్వారా సేకరించిన అభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో డెలివరీ సిబ్బంది ప్రజల నుంచి గ్యాస్ సిలిండర్ ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేయకుండా సంబంధిత డీలర్లు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రతి ఫిర్యాదుకు రూ.5 వేల చొప్పున అపరాధ రుసుం విధిస్తామన్నారు. గ్యాస్ డెలివరీ సమయంలో తూనిక యంత్రంతో తూచి లబ్ధిదారునికి అందించాలన్నారు. అందుకు గాను తూనికల శాఖ నుంచి ఆమోదం పొందిన కాటాలను వినియోగించాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై విచారణ జరిపి సకాలంలో నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి, తూనికలు కొలతల శాఖ సహాయ కంట్రోలర్ బి.రామచంద్రరావు, గ్యాస్ కంపెనీల డీలర్లు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న జయప్రకాష్

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, ఏపీ రెసిడెన్సీ స్కూల్స్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పాల్‌ల్యాబ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన విద్యనందించాలని చెప్పారు. డిప్యూటీ డీఈవో అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాల్‌ల్యాబ్ జిల్లా నోడల్ అధికారి వి.శ్రీలక్ష్మి, ఏఎస్‌వో రాధాకృష్ణ, డీఎస్‌వో శ్రీనివాసరావు, హెచ్ఎం సుమామణి, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ఐటీ ఉద్యోగికి తీవ్ర గాయాలు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన సంఘటనలో ఐటీ ఉద్యోగి తీవ్రంగా గాయపడింది. పెదగంట్యాడలోని వినాయకనగర్‌కు చెందిన జి.జ్యోతిర్మయి సోమవారం రుషికొండ ఐటీ హిల్స్‌లో విధుల నుంచి ర్యాపిడో (ద్విచక్రవాహనం)పై వస్తుండగా బీచ్‌రోడ్డులో ఐటీ కూడలి వద్ద సాగర్‌నగర్ నుంచి తిమ్మాపురంవైపు ఓ కారు వచ్చి ఢీ కొట్టింది.

జీడికి మద్దతు ధరపై అసెంబ్లీలో చర్చించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



వాలాబు గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: జీడి పంటకు మద్దతు ధర కోసం అసెంబ్లీలో చర్చించి జీడి బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర డిమాండ్ చేశారు. మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ పరిధిలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు వెంకన్న, దొర మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు ఘోరంగా మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఏటా వాణిజ్య పంటలకు మద్దతు ధర ప్రకటించి జీడిని విస్మరిస్తున్నారన్నారు. ప్రైవేటు వ్యాపారులు దీనిని ఆసరాగా తీసుకుని ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడి పరిశోధన కేంద్రాలను ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి నాణ్యమైన జీడి మొక్కలను రైతులకు అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో జీడి తోటల అభివృద్ధికి ఎకరాకు రూ.9 వేలు చొప్పున అందజేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంక్‌ల రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిహెచ్.దేముడు, డి.శంకర్, బి.నాగేశ్వరరావు, డి.దాసు, కె.సుదర్శన్, కె.రామస్వామి, ఇ. గోపాలుడు, పి.శ్రీరామ్, మామిడి దేముడు, గూట్ల దేముడు, చెదల ఎరకన్నదొర, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

విశాఖకు మల్లన్న తలపాగా

- విజయనగరం జిల్లా నుంచి శ్రీశైలానికి..
- పాగా దర్శనం ఎంతో విశిష్టం
- అల్లిపురంలో ప్రత్యేక పూజలు
- శివరాత్రి రోజు శ్రీశైలంలో అలంకరణ



పెనుబాక నుంచి వచ్చిన పాగాతో శివ భక్తుడు అప్పలనాయుడు, పాగా నేసిన నేతన్నలు, భక్తులు

అల్లిపురం: సంప్రదాయ ఉత్సవాలలో భాగంగా శ్రీశైలంలో పాగా దర్శనానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ దర్శనం ముక్తిదాయకమని వేద పండితులు చెబుతుంటారు. మల్లన్న తలపాగా ధారణ చూసి తరించేందుకు లక్షల మంది భక్తులు అక్కడికి చేరుకుంటారు. మహాశివరాత్రి నాడు అర్ధరాత్రి లింగోద్భవం తర్వాత.. భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న పాగా దర్శించుకుంటారు.

దిగంబరంగ ఆలయ శిఖరం నుంచి నవనందులకు చేనేత వస్త్రాన్ని తలపాగా ధరింపజేసే మహాభాగ్యం ఉత్తరాంధ్ర జిల్లాలకు కలగడం అదృష్టంగా భావించవచ్చు. ఆ అదృష్టం విజయనగరం జిల్లా పెనుబాక గ్రామానికి చెందిన ఆశపు రవణ దంపతులతో పాటు సంతకవిటి మండలం మందరాడకు చెందిన ముతికి వీర్రాజు దంపతులకు కలగడం విశేషం. ఈ మేరకు వారు విజయనగరం కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకుని పాగాను నేశారు.

భక్తి శ్రద్ధలతో..

వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభించిన పాగా నేతను ముక్కనుమ రోజు నుంచి సిద్ధం చేస్తారు. అప్పటి నుంచి కఠిన నియమ నిష్ఠలతో నిత్య శివనామస్మరణతో మాలధరించి, పూజలు నిర్వహిస్తూ ఈ తలపాగాను తయారు చేస్తారు. తెల్లని వస్త్రాన్ని నియమ నిష్ఠలతో సంవత్సరానికి 365 రోజులకు గాను రోజుకు మూర చొప్పున 365 మూరలు వస్త్రాన్ని నేయడం విశేషం. అనంతరం పాగా మొత్తాన్ని శివలింగం ఆకారంలో చుట్టి, విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భజనలు చేపడతారు.

అల్లిపురం చేరిన పాగా

అలా నియమ నిష్ఠలతో తయారు చేసిన పాగాను విశాఖలో అల్లిపురం, బృందావన్ జంక్షన్ వద్ద గల ప్రముఖ శివ భక్తుడు పీలా వెంకట చిన అప్పలనాయుడు ఇంటికి ఆదివారం ఒకటి, సోమవారం ఒకటి చేరుకున్నాయి. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నగరంలో పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం శ్రీశైలం తరలించనున్నారు.

క్లుప్తంగా

త్రిపురాంతకస్వామికి ప్రత్యేక అలంకరణ



శివాలయంలో త్రిపురాంతకస్వామి అలంకరణ

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగాన్ని అందంగా పూలతో అలంకరించి అర్చించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆలయానికి లైటింగ్ బోర్డు వితరణ



వేంకటేశ్వరస్వామి ఆలయానికి హెటెరో సమకూర్చిన లైటింగ్ బోర్డు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి నక్కపల్లిలోని హెటెరో పరిశ్రమ ఎంప్లాయిస్ ఆర్థిక సహకారంతో లైటింగ్ బోర్డును సోమవారం ఏర్పాటు చేశారు. ఎంప్లాయిస్ ప్రతినిధి పొట్టిమూర్తి శ్రీనివాసరావు ప్రోత్సాహంతో దీన్ని సమకూర్చినట్లు ఆలయ ప్రతినిధి కోన నాగవెంకట సురేష్ తెలిపారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నూతన ట్రాన్స్‌ఫార్మర్

తుమ్మపాల: వేసవిలో లోటల్టేజీ సమస్యలు తలెత్తకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అశోక్ తెలిపారు. మండలంలో రేబాక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత కాలంగా లోటల్టేజీ ఉండటంతో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో పలు చోట్ల లైన్ ట్రాన్స్‌ఫర్లు కూడా చేసి సమస్యలు తలెత్తకుండా మరమ్మతులు చేశామన్నారు. కార్యక్రమంలో లైన్‌మన్ సంకర బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 9,721 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,720	4,500
మొదటి రకం	3,510	4,220
రెండో రకం	3,150	3,760
మూడోరకం	3,000	3,120

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
ఆరెంజ్ : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
సూర్య కృష్ణన్ : వెంకటేశ్వర(ఉదయం)
తల : వెంకటేశ్వర(మ్యాట్నీ, 1, 2 షోలు)
సై : శ్రీసత్య
రామం రాఘవం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (97036 19706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

టమాటా నేలచూపు

- కిలో రూ.5లోపే అమ్మకం
- గగ్గోలు పెడుతున్న రైతులు
- తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న అనకాపల్లి కాయగూరల మార్కెట్



కొనుగోలుదారుల కోసం ఆశగా చూస్తున్న రైతులు

అనకాపల్లి టౌన్: మూడు మాసాల క్రితం వరకు తారాస్థాయికి చేరిన టమాటా ధర నెల రోజులుగా నేల చూపు చూస్తోంది. రోజు రోజుకీ ధర పతనమవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా కిలో రూ.5 లోపే ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏ కూర వండాలన్నా.. టమాటా తప్పనిసరిగా వాడాల్సిందే. అంతటి ప్రాధాన్యత ఉన్న టమాటా పండించే రైతు మాత్రం కన్నీరు పెడుతున్నాడు. స్థానిక మార్కెట్‌కు సమీప ప్రాంతాలైన కశింకోట మండలంలోని విస్సన్నపేట, గొబ్బూరు, అనకాపల్లి జాతీయ రహదారికి ఆనుకున్న ఆవ, కోడూరు, అక్కిరెడ్డి పాలెం తదితర గ్రామాల్లో రైతులు టమాటా పంట పండిస్తున్నారు. అక్కడి నుంచి ఆటోలలో మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తుంటారు. వీరికి కనీసం చార్జీలు కూడా రావడం లేదు. వీరంతా పెట్టుబడి ధర కూడా రావడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

30 కిలోల కేట్‌కు రూ.130..

నిన్న, మొన్నటి వరకు కిలో టమాటా రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముతూ సామాన్యులకు చుక్కలు చూపించింది. 30 కిలోల కేట్ రూ.130 నుంచి రూ.150 మాత్రమే సోమవారం అమ్మకాలు జరిగాయి. ఈ లెక్కన కేజీ రూ.5 లోపు పలికింది. రిటైల్ వ్యాపారులు మాత్రం రూ.10 నుంచి రూ.12 వరకు అమ్ముతున్నారు. పెళ్లిళ్ల సీజన్ అయినా కూడా ధర పలకడం లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించినా ధర పలకపోవడంతో రైతులు బజారుకు అమ్మకానికి తెచ్చే సాహసం కూడా చేయలేకపోతున్నారు. అయితే కొద్ది రోజులుగా ధర భారీగా పతనమవుతోంది. ఇలా అయితే పంటలు పండించడం మానుకోవాల్సి వస్తుందని, అయితే వ్యవసాయం మీద మక్కువతో పండిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు రాలేదు



రెండెకరాలు కౌలుకు తీసుకొని అప్పు చేసి టమాటా పంట పండించాను. పంట తీసి మార్కెట్‌కు పట్టుకెళ్తే ఏ ఒక్కరూ కొనడం లేదు. దాంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

– శ్రీనివాసరావు, కోడూరు

కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి



రైతుల శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. గ్రామాల నుంచి తీసుకొచ్చిన పంటకు ధర లేక నష్టపోతున్నారు. ప్రధానంగా పట్టణంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతుల పంటలకు గిట్టుబాటు ధర వస్తుంది. కనీసం రైతు బజార్ కూడా లేదు. దళారులే బాగుపడుతున్నారు.

– పి.ప్రసాద్, అనకాపల్లి

మద్యం విక్రేత అరెస్టు



మద్యం విక్రేతతో ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం పెట్రోల్ బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసు సిబ్బంది దాడి చేశారు. ఈ మేరకు 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అనకాపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైఎల్ నాయుడు సోమవారం తెలిపారు. నిందితుడు లక్కరాజు బాపూజీని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రేపు మహా శివరాత్రి మహోత్సవాలు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 26న మహా శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దత్తక్షేత్ర నిర్వాహకుడు ఆంజనేయరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున గిరీశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, శివకల్యాణం, భక్తులకు మధ్యాహ్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు పంచామృతాలతో ఏకవార రుద్రాభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో పంచామృతాలతో, ఫలరసాలతో విశేష ద్రవ్యాలతో ప్రత్యేకంగా ఏకవార రుద్రాభిషేకాలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలతో ఆదాయం



వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా ఎరువు తయారు చేసి విక్రయించడం వల్ల పంచాయతీలకు మరింత ఆదాయం పొందవచ్చునని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. మండలంలోని పేరంటాలపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎరువు తయారీపై గ్రామ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద కేంద్రంలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, ఘన పదార్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారు చేయడం, వాటి అమ్మకం ఎలా అనే విషయమై వివరించారు. ఈ విధానాన్ని పాటించి సంపద కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. సంపద కేంద్రం నిర్వహణ వల్ల గ్రామంలో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చునన్నారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ ఎం వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, సత్యారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల ధర్నా

అనకాపల్లి: ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సోమవారం రొంగలివానిపాలెంలో మహిళలు నిరసన తెలియజేశారు. మండలంలోని కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్‌లో పలువురు భూములు కోల్పోయారు. భూములిచ్చిన రైతులకు మిగిలిన భూమిని తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని, లేని పక్షంలో మొత్తం భూమిని తిరిగి వెనక్కి ఇచ్చేయాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులు బొడ్డు లక్ష్మి, ఈశ్వరమ్మ, పొన్నాడ నాగమణి, ఇంటి పార్వతి, బుర్ర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'రోటరీ' వ్యవస్థాపక దినోత్సవం



చిదంబరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: రోటరీ ఇంటర్నేషనల్ 120వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో పట్టణ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేశారు. పట్టణంలో క్లబ్ ఏర్పాటు చేసిన పాలూరి చిదంబరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి పేదలకు ఉచితంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది పట్టణ పరిధిలో 30 మంది నిరుపేదలకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క మిషన్ విలువ రూ.25 వేలు ఉంటుందని, 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. అంతకుముందు గవరపాలెం గోషాస్పత్రిలో గర్భిణులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సాయిబాబా మందిరం వద్ద ఉచితంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అనిల్, సభ్యులు సురేష్ కుమార్, కేఎల్ కుమార్, కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, ఉప్పల రామకృష్ణ, పీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్ రాజా అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో కశింకోట మండలం తేగాడ గ్రామంలో ఈ నెల 25న నిర్వహించే ముత్యాలమ్మ జాతర పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, రాత్రి భారీ మందుగుండు సామగ్రి కాల్పులు వంటి అనేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సర్పంచ్ నీటిపల్లి దివాకర్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు టి.వి.సత్యనారాయణ, దమ్ము జాను, మక్కా సన్యాసిరావు, పడాల నాగేశ్వరరావు, గైపూర్ రాజు, శ్రీధరాల మనోజ్, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ పండగ

కశింకోట: తేగాడలో ముత్యాలమ్మ పండగ మంగళవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శారదానది అవతల చెట్టు రూపంలో వెలసిన అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీటిపల్లి దివాకర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారి పుట్టుక ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారిని సంప్రదాయ డప్పులు, వాయిద్యాలతో ఊరేగించారు.

జానకీరామరాజుకు ఘన సత్కారం



జానకీరామరాజును శాలువాతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షునిగా మరోసారి నియమితులైన మందపాటి జానకీరామరాజును సోమవారం ఉడ్‌పేట కార్యాలయంలో పార్టీ శ్రేణులు శాలువాలతో సత్కరించి, మిఠాయిలు పంచిపెట్టాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి జానకీరామరాజు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ ఆడారి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లు త్రినాథరావు, సహాయ కార్యదర్శి దొడ్డి సూరిబాబు, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, నాయకులు బర్నికాన గోవిందరావు, బొబ్బిలి రామారావు, పాలమరశెట్టి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మలసాల కిశోర్‌కు సన్మానం



కిశోర్‌ను అభినందిస్తున్న చింతలపాలెం పార్టీ ప్రతినిధులు

కశింకోట: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షునిగా రెండోసారి నియమితులైన మలసాల కిశోర్‌ను చింతలపాలెం గ్రామానికి చెందిన పార్టీ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలోని తన ఇంట్లో కిశోర్‌ను కలిసి దుశ్శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో చింతలపాలెం గ్రామ అధ్యక్షుడు షేక్ శ్రీను, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ చిత్తూరు అప్పారావు, మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రతినిధులు కోన శ్రీను, దాడి శాంతరాజు, బుదిరెడ్డి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఉచిత బస్సు ప్రయాణంపై వినతి



ఆర్టీసీ జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జి

అనకాపల్లి: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, కార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ కోరారు. స్థానిక ప్రజారవాణా శాఖ జిల్లా అధికారి కె.పద్మావతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల సమయంలో ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదే సౌకర్యం కల్పించాలన్నారు. ఇంటర్ పరీక్షల సమయంలో అధిక నగదు ప్రైవేట్ వాహనదారులకు చెల్లించి కేంద్రాలకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, నాయకులు శ్రీను, సింహాద్రి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా శివాలయాలు

శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుత్ కాంతులతో గవరపాలెం భోగలింగేశ్వస్వామి ఆలయం



భోగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వయంభూగా వెలిసిన శివలింగం



సాధువుల గుడిలో నెలకొల్పిన శివుని విగ్రహం



సిద్ధిలింగేశ్వర స్వామి ఆలయం ముందు కొబ్బరి ఆకులతో వేసిన సెట్



శారదానది ఒడ్డున నిర్మితమైన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం

అనకాపల్లి టౌన్: పరమ పవిత్రమైన మహా శివరాత్రి ఉత్సవాలకు పట్టణంలో శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి, మెయిన్‌రోడ్ సిద్ధిలింగేశ్వర స్వామి, శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వర స్వామి, కాయగూరల మార్కెట్ వద్ద సాధువుల గుడి, తదితర ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంతో పాటు మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలకు వచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. దీంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇటీవల నూతనంగా ఏర్పాటైన కమిటీలు అవసరమైన చర్యలు చేపడుతున్నాయి.

400 ఏళ్ల చరిత్ర గల దేవాలయం...

ప్రాచీన శైవ క్షేత్రాలలో ప్రసిద్ధి చెందిన గవరపాలెం కోటవీధిలో వెలసిన సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామివారి దేవాలయం. 1611లో స్వయంభూగా వెలిసింది. అనకాపల్లిని పాలించిన కాకర్లపూడి రాజ్యాధిపతి అప్పలరాజు శత్రుదుర్భేద్యమైన కోటను నిర్మించారు. కోటకు ఉత్తరాన స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని చూసి ఆలయాన్ని నిర్మించారు. తదుపరి సర్వకామదాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి కోటవీధి ఆలయంగా పేరొందింది.

300 ఏళ్ల చరిత్ర గల ఆలయం ...

కాయగూరల మార్కెట్ జంక్షన్ వద్ద సాధువుల గుడిగా పేరొందిన సిద్ధిలోకేశ్వరి సహిత అమృత మహా కాళేశ్వరస్వామి ఆలయానికి మూడు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. 17వ శతాబ్దం నాటి నుంచి మహా కాళేశ్వరునికి పూజలు జరిగినట్లు స్థల పురాణాలు చెపుతున్నాయి. ఈ దేవాలయంలో చెముడు ఎస్టేట్‌కు చెందిన మహారాణి 17వ శతాబ్దంలో రోజూ సొరంగ మార్గం నుంచి వచ్చి పూజలు చేసేవారు. ఇప్పటికీ ఆ సొరంగ మార్గం ఆనవాళ్లు ఉన్నాయి. ఆమె తదనంతరం కాశీ పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన నాగసాధువు ఇక్కడ స్థిర నివాసం ఏర్పటు చేసుకొని స్వామివారి కోసం జపం చేసినట్లు చెపుతుంటారు. ఆలయానికి జటల సాధువులు, అన్నపూర్ణ కావిడి సాధువులు వచ్చి జప, తప, అర్చనలు చేసేవారు అని పూర్వీకులు అంటుండేవారు. ఆ విధంగా ఈ గుడికి సాధువుల గుడిగా పేరు గాంచింది.

సిద్ధిలింగేశ్వర స్వామి ఆలయం...

పూర్వకాలంలో బళ్లారి జిల్లా వాస్తవ్యులు మహాలింగేశ్వర స్వామి వారు ఆంధ్రా ప్రాంతమున సంచారం చేయుచూ ఇప్పుడు ఆలయం ఉన్న స్థలమును చూసి మర్గీ మఠం అని నామకరణం చేసి లింగ ప్రతిష్ఠ చేసియున్నారు. ఛండీకేశ్వర పురాణం నుంచి ఈ దిగువ కథ ప్రచారంలో ఉంది. గోకర్ణ క్షేత్రములోని ఒక కాపువాని గోవు అతనికి పాలు ఇవ్వక ప్రతి నిత్యం సమీపంలో పుట్టలో నాగేంద్రునికి పుట్ట రంధ్రం గుండా పాలు ధారలుగా ఇచ్చుచున్నది. అది అంతయు గోవు యజమాని చూచి కోపోద్రిక్తుడై ఆ గోవును చంపి సమాధి చేసెను. ఆ గొవు ఏకాదశి సోమవారం నాడు లింగోద్భవ కాలంలో మరణించెను. మూడో రోజున గోవును సమాధి చేసిన చోట గోవు చెవి నుంచి పరమేశ్వరుని లింగాకృతి ఉద్భవించెను. అట్లు ఉద్భవించిన లింగమును మహా లింగేశ్వర స్వామి తీసుకొని వచ్చి అనకాపల్లిలో ప్రతిష్ఠ గావించినట్లు చెపుతుంటారు.

కాశీ విశ్వేశ్వర ఆలయం...

1865లో ఒక బాటసారి కాశీ నుంచి తెచ్చిన శివలింగం వదిలేసి కాలం చేయగా, సదరు శివలింగాన్ని అనకాపల్లి వాస్తవ్యులు తాటికొండ నూకయ్య, శెట్టి శైవగమ సాంప్రదాయం ప్రకారం ఆలయ నిర్మాణం చేసి ప్రతిష్ట చేయించారు. ఆనాటి నుంచి జ్యేష్ట శుద్ధ ఏకాదశి నాడు స్వామివారి వార్షిక కళ్యాణం చేస్తున్నారు.

ఉమా రామలింగేశ్వర ఆలయం...

1962లో గవరపాలెంకు చెందిన మహిళ శారదానది ఒడ్డున శివలింగం ప్రతిష్ఠ చేసిందని పూర్వీకుల నానుడి. తదుపరి కొంతమంది పూజారులు ఆలయాన్ని కమ్మలతో నిర్మించగా, 1977 వరదలలో కొద్దిగా కొట్టుకుపోగా 90లో వచ్చిన వరదలలో ఆలయం పూర్తిగా కొట్టుకుపోవడంతో పాటు పూజారి కొట్టుకు పోయాడు. కాలక్రమేణా స్థానికంగా అడ్డబోయిన రాములు మరికొంత మంది చందాలు కూడబెట్టి పక్కా ఆలయాన్ని నిర్మించి 62లో ప్రతిష్ఠించిన మహిళతో మరళా శివలింగాన్ని రప్పించి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

పట్టణంలో పొగమంచు



పొగమంచులో మార్కెట్ యార్డు ప్రాంతం



మంచు ముసుగులో రైల్వే స్టేషన్

అనకాపల్లి టౌన్: పట్టణంలో రెండు రోజుల నుంచి పొగమంచు కురుస్తోంది. ఫిబ్రవరి నెలాఖరు వచ్చినా మంచు పడుతోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. దట్టంగా కురుస్తున్న మంచు వల్ల వాకింగ్ చేసే వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రకృతి ప్రేమికులు మాత్రం మంచు తెరలను ఆస్వాదిస్తున్నారు. ఈ మంచు వల్ల మామిడి, జీడి పూతలు మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఐకు ఎస్పీ ప్రశంసలు

రోలుగుంట: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితులను పట్టుకోవడంలో రోలుగుంట ఎస్ఐ పొన్నాడ రామకృష్ణారావు తనదైన శైలిలో ప్రతిభ చూపారు. ఎస్ఐ పనితీరును ఎస్పీ తుహిన్ సిన్హా గుర్తించారు. సోమవారం తన కార్యాలయంలో ఎస్ఐ రామకృష్ణారావుకి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.